సాక్షి నిర్మల్
సోమవారం ¦ 11 ¦ మార్చి ¦ 2024



అమ్మవార్లకు పూజలు

కుంటాల: మండల కేంద్రంలోని గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మీ ఆలయాల్లో ఆదివారం భక్తులు పూజలు చేశారు. జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు తరలివచ్చారు.



అ'పూర్వ'ం.. ఆత్మీయ సమ్మేళనం

వివిధ ప్రాంతాలు, వృత్తుల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం పేరిట చదివిన పాఠశాలలో కలుసుకున్నారు. రోజంతా సరదాగా గడిపారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.0 /24.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

సావిత్రీబాయిపూలే వర్ధంతి



చిత్రపటానికి పూలమాల వేస్తున్న కృష్ణంరాజు

నిర్మల్‌టౌన్‌: జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ భవన్‌లో ఆదివారం సావిత్రీబాయి పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు కృష్ణంరాజు, జిల్లా అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్‌ సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె సేవలు కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు అశోక్‌చారి, రమేశ్‌, కిషన్‌, జీవన్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సైనిక్‌స్కూల్‌ ప్రవేశపరీక్ష



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

నిర్మల్‌: సారంగాపూర్‌ మండలంలోని జామ్‌ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో ఆదివారం ఇంటర్‌ ప్రథమ, ఆరోతరగతిలో ప్రవేశానికి నిర్వహించిన రుక్మాపూర్‌ సైనిక్‌ స్కూల్‌ ఎంట్రన్స్‌ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. 423మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 402మంది హాజరైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్‌, పరీక్షల సీఎస్‌ రమాకళ్యాణి తెలిపారు.

టీయూటీఎఫ్‌ కార్యవర్గం


రవికాంత్‌


వహీద్‌ఖాన్‌

నిర్మల్‌ రూరల్‌: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌ (టీయూటీఎఫ్‌) జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా మహాసభల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ముస్కు పరమేశ్వర్‌రెడ్డి, అధ్యక్షుడిగా తోడిశెట్టి రవికాంత్‌, ప్రధాన కార్యదర్శిగా వహీద్‌ఖాన్‌, కోశాధికారిగా పోల ధర్మరాజ్‌, సహాధ్యక్షులుగా కే సునీల్‌రెడ్డి, ఎం.నాగరాణి, సంయుక్త కార్యదర్శులుగా మేడారం శ్రీనివాస్‌, వేముల శివరాణి, కార్యదర్శులుగా బీమా భూపతి, వీర్వా పాటిల్‌, వీ నారాయణరెడ్డి, రాథోడ్‌ రఘునాథ్‌, పత్కి జ్ఞానేశ్వర్‌రావు, పీ స్వామిరెడ్డి, ఎం.వినోద్‌రాజ్‌, కొత్త కోటేశ్‌, గోలి సాయన్న, ఆడిట్‌ కమిటీ కన్వీనర్‌గా శరత్‌చంద్రారెడ్డి, సభ్యుడిగా కండెల నరేశ్‌ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ లచ్చిరాం, పరిశీలకుడిగా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఏ మురళిమనోహర్‌రెడ్డి వ్యవహరించారు. సంఘ బలోపేతానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతన కార్యవర్గం పేర్కొంది.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలకు హాజరైన విద్యార్థులు

భైంసా: యూనివర్సల్‌ పోస్టల్‌ యూనియన్‌ (యూపీయూ) ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఉర్దూ మీడియం స్కూల్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. యూపీయూ 150 సంవత్సరాలుగా అందిస్తున్న సేవల్లో భాగంగా భారతీయ తపాలా శాఖ ఏటా 9–15 ఏళ్ల విద్యార్థులకు ఇంటర్నేషనల్‌ వ్యాసరచన పోటీలు నిర్వహిస్తోంది. జాతీయస్థాయిలో రూ.50వేలు, రూ.25వేలు, రూ.10వేలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇవ్వనుంది. రాష్ట్రస్థాయిలో రూ.25వేలు, రూ.10వేలు, రూ.5వేలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇస్తుంది. ఇందులో భాగంగా భైంసా సబ్‌ డివిజన్‌ పరిధిలో సబ్‌ డివిజనల్‌ పోస్టల్‌ ఇన్‌స్పెక్టర్‌ దిలీప్‌కుమార్‌ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించగా వివిధ పాఠశాలలకు చెందిన 128మంది విద్యార్థులు హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాప్రసాద్‌, ఏస్పీఎం గంగయ్య, నరేశ్‌, తపాలా, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కారు ఖాళీయేనా?



- పార్టీ మార్పునకే మెజార్టీ మొగ్గు
- త్వరలో మాజీ మంత్రి ఐకేరెడ్డి..!
- ఆయన వెంటే మాజీ ఎమ్మెల్యేలూ..
- నేడు హైదరాబాద్‌లో చర్చలు
- అతి త్వరలో కాంగ్రెస్‌లో చేరిక
- సీఎం ఓకే చెప్పడమే తరువాయి

నిర్మల్‌: జిల్లాలో 'కారు' ఖాళీ కానుందా..! అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో పార్టీ మార్పు నిర్ణయానికే తాము మొగ్గుచూపుతున్నట్లు అధికశాతం గులాబీనేతలు చెబుతున్నారు. మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డితో పాటు పలువురు ముఖ్య నేతలు పార్టీని వీడటం దాదాపు ఖాయమైంది. కాంగ్రెస్‌లో చేరికపై సోమవారం హైదరాబాద్‌లో చర్చలు జరపనున్నారు. ఈమేరకు ముఖ్యనేతలు ఆదివారమే హైదరాబాద్‌ చేరుకున్నారు. తమ పార్టీలోకి ఎవరైనా రావచ్చని, కానీ.. సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్‌ ఇస్తేనే జాయినింగ్స్‌ ఉంటాయని కాంగ్రెస్‌ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌ చెబుతున్నారు. ఇక అన్నీ కుదిరితే అతిత్వరలోనే మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే, సీనియర్ల చేరికలు ఉండనున్నాయి.

పట్టించుకోవడం లేదనే..

ఇప్పటికే కొందరు సీనియర్లు పార్టీని వీడినా.. మరికొందరు బయటకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నా.. బీఆర్‌ఎస్‌ బాసులు ఎందుకు సీరియస్‌గా తీసుకోవడం లేదన్న ప్రశ్న ఆ పార్టీ క్యాడర్‌లో వస్తోంది. ఇటీవల మాజీమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సోదరుడు హన్మంత్‌రెడ్డి మరణించారు. మాజీ సీఎం కేసీఆర్‌ ఫోన్‌లో మాత్రమే ఇంద్రకరణ్‌రెడ్డిని పరామర్శించారు. పార్టీకి చెందిన ప్రధాన నేతలుగా చలామణిలో ఉన్నవారెవరు కనీసం పరామర్శించేందుకైనా ఎందుకు రాలేదని గులాబీశ్రేణులే ప్రశ్నిస్తున్నాయి. ఇప్పటికే ఓటమి నైరాశ్యంలో ఉన్న తమకు ఇలా పార్టీ నుంచి ఆశించిన స్థాయిలో పట్టింపు లేకపోవడంతోనే కారును వీడేందుకు సిద్ధమైనట్లు గులాబీ నేతలు చెబుతున్నారు.

అందరూ వీడుతారా..?

జిల్లాకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్లే పార్టీ మారుతుండటంతో ఇక కిందిస్థాయి నేతలు, కార్యకర్తలూ ఆలోచనలో పడ్డారు. ఇప్పటి వరకైతే పార్టీ మార్పుపై తమతో పూర్తిస్థాయిలో చర్చలు జరపలేదంటున్నారు. మరోవైపు ప్రస్తుతం జిల్లాలో ఉన్న పరిస్థితుల నేపథ్యంలో తామంతా పార్టీ మార్పునకే మొగ్గు చూపుతున్నామని మెజార్టీ బీఆర్‌ఎస్‌ నేతలు చెబుతున్నారు. ఇదే వారి ఆఖరి నిర్ణయమైతే జిల్లాలో దాదాపు బీఆర్‌ఎస్‌ మొత్తం ఖాళీ కానుంది. ప్రధానంగా నిర్మల్‌, ముధోల్‌ నియోజకవర్గాల్లో కారుకు పెద్ద దెబ్బ పడేలా ఉంది. ఖానాపూర్‌లో ఎన్నికలకు ముందే మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్‌ కాంగ్రెస్‌లోకి వెళ్లారు. అక్కడ బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ మిత్రుడు జాన్సన్‌ నాయక్‌ ఉండటంతో ఖానాపూర్‌లోనే కొంతవరకు క్యాడర్‌ మిగులుతుందన్న చర్చ నడుస్తోంది.

సమీక'రణం'పై చర్చ

పార్టీల్లో చేరికలకు ముందే జిల్లాలో రాజకీయ సమీక'రణం'పై చర్చ జోరుగా నడుస్తోంది. మాజీమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరితే ఇక్కడ ఇప్పటికే ఉన్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు పరిస్థితి ఏమిటన్న విషయంపై చర్చిస్తున్నారు. గతంలో శ్రీహరిరావు బీఆర్‌ఎస్‌లో ఉండగా, బీఎస్పీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఇంద్రకరణ్‌రెడ్డి కారెక్కారు. అనంతర పరిస్థితుల్లో శ్రీహరిరావు కాంగ్రెస్‌లో చేరారు. ఇప్పుడూ ఆయన ఉన్న హస్తం పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉంది. ఇప్పుడు మళ్లీ అల్లోల కాంగ్రెస్‌వైపు అడుగేస్తుండటమే తాజా చర్చకు కారణంగా మారింది. అలాగే ముధోల్‌లో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరితే ఇప్పటికే అక్కడ సీనియర్‌గా ఉన్న మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్‌ ఎలా స్పందిస్తారనేది చర్చనీయాంశమైంది. మరోవైపు ఆదివారం సారంగపూర్‌ మండలానికి చెందిన కాంగ్రెస్‌ నేతలు బీఆర్‌ఎస్‌ నాయకుల చేరికలను వ్యతిరేకించడం, సోషల్‌ మీడియాలోనూ పలువురు వ్యతిరేక పోస్టులు వైరల్‌ చేయడం ఆసక్తిగా మారింది.

నేడు హైదరాబాద్‌లో చర్చలు..

జిల్లా నుంచి బీఆర్‌ఎస్‌ నేతలు కాంగ్రెస్‌లో చేరాలన్న ప్రతిపాదనలపై సోమవారం హైదరాబాద్‌లో చర్చలు జరగనున్నాయి. ఈమేరకు ఆదివారమే జిల్లా నుంచి కాంగ్రెస్‌ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌, బీఆర్‌ఎస్‌ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు హైదరాబాద్‌ చేరుకున్నారు. పార్టీలో ఎవరెవరు చేరుతారు, ఎప్పుడు చేరుతారు.. తదితర అంశాలు కొలిక్కిరానున్నాయి. మరోవైపు ప్రస్తుతం కాంగ్రెస్‌లో చేరికలు సాధారణ విషయం కాదని, జిల్లాలో పరిస్థితులను చూసి, సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకుంటారని ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌ స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి తీసుకునే నిర్ణయం ప్రకారమే చేరికలు ఉంటాయని చెప్పారు. మొత్తం మీద సోమవారం చేరికలపై కొంత క్లారిటీ రానున్నట్లు ఇరుపార్టీల నేతలు చెబుతున్నారు.

'ఐకేరెడ్డి కాంగ్రెస్‌లోకి వద్దు'

నిర్మల్‌: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్‌ఎస్‌ మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని పార్టీలో చేర్చుకోవద్దని బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు దశరథ రాజేశ్వర్‌ కోరారు. సారంగపూర్‌ మండల కేంద్రంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రిపై అనేక అవినీతి ఆరోపణలున్నాయని ఆరోపించారు. ఇలాంటి వారిని చేర్చుకుంటే పార్టీ ప్రతిష్ట దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. 2023 ఎన్నికల్లో ఆయన అవినీతిని భరించలేకే ప్రజలు చిత్తుగా ఓడించిన విషయాన్ని పార్టీ అధినాయకత్వం గుర్తించాలని కోరారు. ఐకేరెడ్డిని పార్టీలోకి చేర్చుకుంటే జిల్లాలోని కాంగ్రెస్‌ నాయకుల మనోభావాలు దెబ్బతింటాయని తెలిపారు.

'కార్డు'ంటే కరెంట్‌..!

- అర్హులకు జీరో బిల్లుల పంపిణీ
- 'జీరో' రాకుంటే ఆందోళన వద్దు
- మళ్లీ దరఖాస్తు చేస్తే పథకం వర్తింపు
- తెలుపు రేషన్‌కార్డు తప్పనిసరి



భైంసాటౌన్‌: రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి కింద 200 యూనిట్లలోపు కరెంట్‌ వినియోగించుకున్న వారికి ఉచిత విద్యుత్‌ అందిస్తోంది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుని వివరాలన్నీ సరిగా ఉన్నవారికి ఈనెల నుంచే సిబ్బంది జీరో కరెంట్‌ బిల్లులు జారీ చేస్తున్నారు. కాగా, ఇంకా కొందరికి 200 యూనిట్లలోపు కరెంట్‌ వాడినా బిల్లు వస్తోంది. దీంతో ఇలాంటివారు ఉచిత విద్యుత్‌పై ఆందోళన చెందుతున్నారు. కాగా, అధికారులు మాత్రం బిల్లు చెల్లించాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. తెలుపు రేషన్‌కార్డు, ఆధార్‌ కార్డు, కరెంట్‌ కనెక్షన్‌ వివరాలతో సంప్రదించాలని సూచిస్తున్నారు. తాజాగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా తెలుపు రేషన్‌కార్డు ఉండి నెలకు 200 యూనిట్లలోపు విద్యుత్‌ వాడినవారికి బిల్లు వస్తే చెల్లించకుండా జీరో బిల్లు కోసం మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీంతో జిల్లాలో తెలుపురేషన్‌కార్డు ఉండి జీరో బిల్లు రానివారు మరోసారి సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాల్సి వస్తోంది.

జిల్లాలో 88,890 జీరో బిల్లులు..

జిల్లాలో 1.91 లక్షల మంది 200 యూనిట్లలోపు విద్యుత్‌ వినియోగిస్తుండగా, వీరిలో 1.13 లక్షల మంది ప్రజాపాలనలో గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. కాగా, వీరిలో ఇప్పటివరకు 88,890 మంది వినియోగదారులకు మాత్రమే జీరో బిల్లులు జారీ చేశారు. ఇంకా మిగతా వినియోగదారులు సరైన వివరాలు అందించలేదు. ఇలాంటి వారు కరెంట్‌ బిల్లు వచ్చినా చెల్లించాల్సిన అవసరం లేదని, తెలుపు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, కరెంట్‌ కనెక్షన్‌ వివరాలతో పట్టణాల్లో మున్సిపల్‌ కార్యాలయాలు, గ్రామాల్లోనైతే ఎంపీడీవో కార్యాలయాల్లోని ప్రజాపాలన సేవాకేంద్రాల్లో సంప్రదించాలని విద్యుత్‌ అధికారులు సూచిస్తున్నారు.

జీరో బిల్లు రాకుంటే సంప్రదించాలి

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల నుంచి 200 యూనిట్లలోపు విద్యుత్‌ వినియోగించిన వారికి జీరో బిల్లులు జారీ చేస్తున్నాం. 200 యూనిట్లలోపు విద్యుత్‌ వాడినా ఇంకా ఎవరికైనా కరెంట్‌ బిల్లు వస్తే చెల్లించాల్సిన అవసరం లేదు. జీరో బిల్లు కోసం మున్సిపల్‌, ఎంపీడీవో కార్యాలయాల్లోని ప్రజాపాలన సేవాకేంద్రాల్లో కరెంట్‌ బిల్లు, రేషన్‌కార్డు, ఆధార్‌ వివరాలతో సంప్రదించాలి.

– జైవంత్‌రావు చౌహాన్‌, ఎస్‌ఈ, నిర్మల్‌

ఓలాలో కుస్తీపోటీలు



తలపడుతున్న మల్లయోధులు



విజేతను సన్మానిస్తున్న గ్రామస్తులు

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని ఆదివారం శివాలయ ఆవరణలో అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు నిర్వహించారు. 107పోటీలు నిర్వహించగా సుమారు 250 మంది మల్లయోధులు తలపడ్డారు. పోటీలకు తెలంగాణ, మహారాష్ట్ర నుంచి మల్లయోధులు రాగా, మహారాష్ట్ర వాసులను విజయం వరించింది. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన మాధవ్‌, మహారాష్ట్రలోని నాందేడ్‌ జిల్లా ఉమ్రి తాలూకాలోని బిద్రెల్లి గ్రామానికి చెందిన ఉమాటి సాయినాథ్‌ చివరి కుస్తీలో తలపడ్డారు. చివరకు ఉమాటి సాయినాథ్‌ విజేతగా నిలిచాడు. ఈయనకు రూ.5వేల నగదు బహుమతితో పాటు రెండుతులాల వెండిగొలుసు బహూకరించి సన్మానించారు. రెండో విజేత మాధవ్‌కు రూ.3వేల నగదు అందజేసి సత్కరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై రజనీకాంత్‌ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్‌ నాలం మహేందర్‌, ఆలయ కమిటీ చైర్మన్‌ కంబోలి చిన్నన్న, ఎంపీటీసీ సభ్యుడు కట్ట రవి, స్థానిక నాయకులు శరత్‌గౌడ్‌, ఎగ్గం నర్సింలు, నాలం సాయన్న, నడ్పి లింగం, భూమన్న, బోజారాం, గంగాధర్‌, సాయన్న, సాంగి రాజేశ్వర్‌, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి 'గొడం'



ఢిల్లీలో తరుణ్‌చుగ్‌, డాక్టర్‌ లక్ష్మణ్‌ సమక్షంలో బీజేపీలో చేరుతున్న మాజీ ఎంపీ గొడం నగేశ్‌

- బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పిన మాజీ ఎంపీ
- ఢిల్లీలో కాషాయ కండువా కప్పుకొన్న నగేశ్‌
- కామన్‌.. అంటున్న ఎంపీ సోయం
- సర్వే చేసి టికెట్‌ ఇస్తారంటున్న వైనం
- మారుతున్న రాజకీయ సమీకరణాలు

సాక్షి, ఆదిలాబాద్‌: మాజీ ఎంపీ గొడం నగేశ్‌ బీజేపీలో చేరారు. బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పి ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. అధినేత కేసీఆర్‌కు లేఖ పంపించారు. కొద్ది రోజులుగా ఆయన కాషాయ పార్టీలో చేరుతారని జరిగిన ప్రచారం నిజమైంది. మాజీ ఎంపీ సీతారాం నాయక్‌, మాజీ ఎమ్మెల్యేలు జలగం వెంకట్రావ్‌, శానంపూడి సైదిరెడ్డితో కలిసి ఢిల్లీలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్‌, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్‌ లక్ష్మణ్‌ సమక్షంలో ఆదివారం కాషాయ కండువా కప్పుకొన్నారు. ఇందులో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, సీనియర్‌ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలో పని చేసేందుకు..

బీజేపీలో చేరిన అనంతరం గొడం నగేశ్‌ మీడియాతో మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారని వివరించారు. ఈమేరకు ఆయన నాయకత్వంలో పనిచేయాలని ఉందని, అందుకోసమే బీజేపీలో చేరినట్లు పేర్కొన్నారు.

అందరూ చేరినట్లే ఆయన చేరారు: గొడం

గొడం నగేశ్‌ బీజేపీలో చేరిక విషయంపై ఎంపీ సోయం బాపూరావును 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా.. అందరూ చేరినట్లే ఆయన కూడా చేరారని పేర్కొన్నారు. ఇదివరకు మాజీ ఎంపీ రాథోడ్‌ రమేశ్‌, మాజీ ఎమ్మెల్యే రాథోడ్‌ బాపూరావు, జెడ్పీ చైర్మన్‌ రాథోడ్‌ జనార్దన్‌ కూడా చేరారని తెలిపారు. పార్టీ సర్వే చేసి టికెట్‌ ఇస్తుందని పేర్కొన్నారు. నా కంటే బెటర్‌గా ఉంటే ఆయనకే వస్తుందన్నారు. ఎంపీ సోయం చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. నగేశ్‌ బీజేపీ టికెట్‌ కన్ఫామ్‌తోనే పార్టీలో చేరారా..? లేదా అన్నది స్పష్టం కావాల్సి ఉంది. ఈ విషయంలో ఆయనను ఫోన్‌లో సంప్రదించగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు.

రెండో జాబితాలో ప్రకటించేనా..

బీజేపీ రెండో జాబితా సోమవారం వెలువడొచ్చని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇందులో ఆదిలాబాద్‌ నియోజకవర్గ ఎంపీ అభ్యర్థిని ప్రకటిస్తారా.. లేని పక్షంలో మూడో జాబితా వరకు వేచి చూడాల్సి వస్తుందా.. అనేది కొద్ది గంటల్లో తేలనుంది. ఏదేమైనా బీజేపీలో ఈ సమీకరణాలు సర్వత్రా ఆసక్తి కలిగిస్తున్నాయి. ప్రధానంగా మహబూబాబాద్‌ నుంచి బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ ఎంపీ సీతారాం నాయక్‌తో కలిసి గొడం నగేశ్‌ బీజేపీలో చేరడం గమనార్హం. అక్కడ లంబాడా సామాజిక వర్గానికి టికెట్‌ కేటాయించిన పక్షంలో ఆదిలాబాద్‌లో ఆదివాసీ సామాజికవర్గానికి ఇవ్వచ్చని ఆ పార్టీ నేతలు అభిప్రాయ పడుతున్నారు. ఏదేమైనా ఆదిలాబాద్‌ సిట్టింగ్‌ స్థానంలో బీజేపీ పరంగా అభ్యర్థి ఎంపికపై అందరు ఆసక్తిగా గమనిస్తున్నారు. తాజాగా చోటు చేసుకుంటున్న రాజకీయ సమీకరణాలపై అందరి దృష్టి నెలకొంది. టికెట్‌ ఎవరికి వస్తుందనే ఉత్కంఠ కొనసాగుతోంది.

ఆర్టీసీ జీతాలు పెరిగినయ్‌

- ఫిట్‌మెంట్‌ ప్రకటించిన ప్రభుత్వం
- నంబరాల్లో ఉద్యోగులు

ఆదిలాబాద్‌ రీజియన్‌ పరిధిలో ఉద్యోగుల సంఖ్య

డిపో	ఉద్యోగులు
ఆదిలాబాద్‌	440
భైంసా	268
నిర్మల్‌	468
ఉట్నూర్‌	120
ఆసిఫాబాద్‌	321
మంచిర్యాల	516
ఆర్‌ఎంవో	52
మొత్తం	2,185



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు

ఆదిలాబాద్‌: ఆర్టీసీ కార్మికులకు 21శాతం ఫిట్‌మెంట్‌ ప్రకటిస్తూ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ మేరకు సంస్థ ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. పలుచోట్ల ఆర్టీసీ ఉద్యోగులు సంబరాలు జరుపుకొన్నారు. ఉద్యోగులకు 2013 వేతన సవరణ బకాయిలతో పాటు 2017, 2021లకు సంబంధించి పీఆర్సీలను చెల్లించాల్సి ఉంది. ఈ క్రమంలో 2013 పీఆర్సీకి సంబంధించి 50 శాతం చెల్లించగా, మిగతా ఎరియర్స్‌ను బాండ్లుగా అందజేసింది. ఈ బాండ్ల బకాయిలను కూడా 8.75 శాతం వడ్డీతో ఈ నెల 11వ తేదీ తర్వాత చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఫిట్‌మెంట్‌పై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూనే.. ఉద్యోగ భద్రత విషయంలో కూడా స్పష్టమైన ప్రకటన చేయాలని ఆర్టీసీ ఉద్యోగులు కోరుతున్నారు.

21శాతం ఫిట్‌మెంట్‌

2017కు సంబంధించి 16శాతం మధ్యంతర భృతిని ఇప్పటికే అందిస్తున్నారు. అదనంగా మరో ఐదు శాతాన్ని పెంచి 21శాతం ఫిట్‌మెంట్‌గా అందించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2017 పీఆర్సీని 21శాతం ఫిట్‌మెంట్‌తో అదే ఏడాది ఏప్రిల్‌ ఒకటో తేదీ నుంచి అందించాలని నిర్ణయించిన ప్రభుత్వం 2021 పీఆర్సీపై మాత్రం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ప్రభుత్వం ప్రకటించిన ఈ ఫిట్‌మెంట్‌ జూన్‌ ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానుంది. పేస్కేల్‌ -2017 బకాయిలను ఉద్యోగుల పదవీవిరమణ సమయంలో వడ్డీ లేకుండా చెల్లించనున్నట్లు ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. సర్కారు తీసుకున్న నిర్ణయంతో ఉద్యోగుల జీతం రూ.8వేల నుంచి రూ.11వేల వరకు పెరిగే అవకాశం ఉంటుందని వివరించింది.

స్వాగతిస్తున్నాం..



రాష్ట్ర ప్రభుత్వం 21శాతం ఫిట్‌మెంట్‌ ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నాం. అయితే కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. యూనియన్లు లేక తమ సమస్యలను ఎవరి దృష్టికి తీసుకెళ్లాలనే విషయం తెలియక ఇబ్బందులు పడుతున్నారు. యూనియన్లను పునరుద్ధరించాల్సిన ఆవశ్యకత నూతన ప్రభుత్వంపై ఉంది. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– లోకుల రమేశ్‌, ఐఎన్టీయూసీ నాయకుడు

మరికొంత పెంచితే బాగుండేది



రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు 21 శాతం ఫిట్‌మెంట్‌ ప్రకటించింది. ఇది మరింత పెంచితే బాగుండేది. ఇప్పటికే 2017 సంవత్సరానికి సంబంధించి ఐఆర్‌ 16 శాతం చెల్లిస్తున్నారు. దీనికి అదనంగా కేవలం ఐదు శాతం మాత్రమే ప్రకటించడం సరికాదు. కనీసం 25 శాతం అయినా ప్రకటిస్తే బాగుండేది.

– ఆశన్న, ఎస్‌డబ్ల్యూఎఫ్‌ డిపో కార్యదర్శి

విలీనంపై స్పష్టత కరువు

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ గత ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా.. ఉద్యోగ వర్గాల్లో హర్షం వ్యక్తమైంది. అయితే ఈ విషయమై ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదు. ఇటీవల కాంగ్రెస్‌ సర్కారు మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టడంతో పనిభారం పెరిగినా శక్తివంచన లేకుండా శ్రమిస్తున్నామని ఉద్యోగులు చెబుతున్నారు. ఫిట్‌మెంట్‌ పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూనే ఉద్యోగ భద్రతపై కూడా స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఎన్‌ఆర్‌ఐ పాలసీ వెంటనే అమలు చేయాలి


మాట్లాడుతున్న దొనికెన కృష్ణ

మామడ: రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఐ పాలసీ వెంటనే అమలు చేయాలని గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక అధ్యక్షుడు దొనికెన కృష్ణ పేర్కొన్నారు. మండలంలోని కొరటికల్ గ్రామంలో గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు ఎన్‌ఆర్‌ఐ పాలసీని చట్టబద్ధం చేసి, గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై దృష్టి సారించాలన్నారు. గల్ఫ్ కార్మిక బాధిత కుటుంబాలకు వివిధ సంక్షేమ కార్యక్రమాల కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.5 కోట్లు కేటాయించాలని కోరారు. గల్ఫ్ కార్మికుల మృతదేహాలను స్వస్థలాలకు తెప్పించడంలో గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక కీలకమన్నారు. అనంతరం తెలంగాణ ఎన్‌ఆర్‌ఐ పాలసీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు నరేందర్, కొక్కుల నవీన్, గల్ఫ్ కార్మికుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మారమ్మ ఆలయంలో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శివాజీచౌక్‌లో మారమ్మ ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఆదివారం ఉదయం ఆలయ సిబ్బంది వెళ్లి చూసేసరికి గర్భగుడిలో తాళం పగులగొట్టి హుండీని ఎత్తుకెళ్లినట్లు గమనించారు. అందులో రూ.40 వేల నగదుతోపాటు అర తులం బంగారం, 10 తులాల అమ్మవారి వెండీ ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని భుక్తాపూర్‌లో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు అస్లమ్ బిన్ మహెమూద్ ఆదివారం వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆయన తెలిపిన వివరాలు.. తన తల్లి అనారోగ్యం బారిన పడడంతో కుటుంబీకులతో కలిసి ఈనెల 6న హైదరాబాద్‌కు వెళ్లారు. శనివారం చుట్టుపక్కల వారు ఫోన్‌చేసి ఇంటి తాళం పగిలి ఉండడంతోపాటు తలుపులు తెరిచి ఉన్నాయని సమాచారం అందించారు. అదే రాత్రి ఇంటికి చేరుకున్నారు. బీరువాలో ఉన్న 10 తులాల బంగారం, 20 తులాల వెండీ నగలు చోరీకి గురైనట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు వివరించారు.

ఒకరిపై హత్యాయత్నం కేసు

ఆదిలాబాద్‌టౌన్: కళ్లలో కారంపొడి చల్లి కత్తితో హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిపై టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. టూటౌన్ ఎస్సై లాల్‌సింగ్ నాయక్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని తిలక్‌నగర్‌కు చెందిన గంటవార్ సచిన్‌కు ఏడాది క్రితం క్రాంతినగర్‌కు చెందిన మహేశ్ బంధువుల అమ్మాయితో పెళ్లిచూపులు జరిగాయి. సచిన్‌కు అమ్మాయి నచ్చకపోవడంతో వేరే సంబంధం చూస్తున్నారు. ఈ విషయమై మహేష్ సచిన్‌తో తరచూ గొడవ పడుతున్నాడు. పట్టణంలోని మహాలక్ష్మివాడ హనుమాన్ మందిర్ సమీపంలో ఆదివారం సచిన్ కళ్లలో కారంపొడి చల్లి కత్తితో దాడికి పాల్పడ్డాడు. శరీరంపై గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదుతో హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై తెలిపారు.

భానుడు భగభగ

బైంసా వెళ్లే ప్రధాన రహదారిపై..



నిర్మానుష్యంగా శివాజీచౌక్



మంజులాపూర్ నుంచి గీతం చౌరస్తా వెళ్లే ప్రధాన రహదారి..



నిర్మల్ జిల్లాకేంద్రంలో ఆదివారం భానుడు భగభగమంటున్నాడు. వాహనాలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారి, ప్రధాన చౌరస్తాల వద్ద జనం లేక రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. నిర్మల్ నుంచి హైదరాబాద్ రోడ్డు, నిర్మల్ టు బైంసా వెళ్లే ప్రధాన రహదారిపై వాహనాలు కనిపించలేదు. జనం రద్దీ లేకుండా నిర్మానుష్యంగా కనిపిస్తున్న రోడ్లను సాక్షి క్లిక్‌మనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

సమ్మె.. ఇక్కట్లు షురూ!

- మొదలైన రిమ్స్ కార్మికుల సమ్మె
- కాంట్రాక్టర్ వేతనంలో కోత విధిస్తున్నారని ఆందోళన
- ఇబ్బందుల్లో రోగులు

ఆదిలాబాద్‌టౌన్: వేతనాల్లో కాంట్రాక్టర్ కోత విధించడాన్ని నిరసిస్తూ రిమ్స్‌లో పనిచేసే ఔట్‌సోర్సింగ్ కార్మికులు సమ్మెబాట పట్టారు. దీంతో రోగులకు ఇక్కట్లు షురూ అయ్యాయి. వారం రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపట్టినా స్పందన లేకపోవడంతో విధులు బహిష్కరించి సమ్మెకు దిగారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ఆందోళన బాటపట్టారు. జిల్లాకేంద్రంలోని రిమ్స్‌లో ఓ కాంట్రాక్టర్ కార్మికుల పొట్టకొడుతున్నాడు. రిమ్స్‌లో మూడు యూనియన్ల కార్మికులు ఉండగా, ప్రస్తుతం ఏఐటీయూసీ అనుబంధ సంఘమైన తెలంగాణ కాంట్రాక్ట్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఆందోళన బాట..

గతనెల 21 నుంచి కార్మికులు ఆందోళన బాట పట్టారు. డైరెక్టర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. గతపక్షం రోజుల పాటు నిరసనలు చేపట్టినా అధికారులు పట్టించుకోకపోవడంతో సమ్మెకు దిగారు. గతేడాదికి పైగా కాంట్రాక్టర్ ఒక్కో కార్మికుడి వేతనం నుంచి దాదాపు రూ.2 వేల వరకు కోత విధిస్తున్నారని పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని డీఎంఈ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ తమ సమస్య పరిష్కారం కావడం లేదని, కాంట్రాక్టర్‌పై చర్యలు చేపట్టడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్య పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు.


రోగులను స్ట్రెచర్‌పై తీసుకెళ్తున్న బంధువులు

రోగులపై ప్రభావం

రిమ్స్‌లో పనిచేసే కొందరు పారిశుధ్య కార్మికులు, పేషెంట్‌కేర్‌లు, సెక్యూరిటీ గార్డులు సమ్మెకు దిగడంతో రోగులపై ప్రభావం పడుతుంది. వారు విధులు బహిష్కరించి రిలేదీక్షలు చేపట్టారు. శనివారం నుంచి సమ్మె చేపట్టగా ఆదివారం సైతం వారి నిరసన కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి అంబులెన్స్, 108లో వచ్చిన రోగులను బంధువులే స్ట్రెచర్, వీల్‌చైర్లపై తీసుకెళ్లారు. పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తుండడంతో ఆయా వార్డుల్లో అక్కడక్కడా అపరిశుభ్రత నెలకొంది.


అపరిశుభ్రంగా ఆస్పత్రి ప్రాంగణం

సమ్మె కొనసాగిస్తాం



కాంట్రాక్టర్ దోపిడీని అధికారులు అరికట్టకపోవడంతోనే సమ్మెకు దిగారు. ఒక్కో కార్మికుడి అకౌంట్‌లో రూ.12,093 జమ చేయాల్సి ఉండగా, రూ.11 వేలు మాత్రమే జమ చేస్తున్నాడు. స్థానికంగా అందుబాటులో ఉండడం లేదు. గత రెండేళ్లుగా కార్మికులను దోచుకుంటున్నాడు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారికి న్యాయం జరిగేవరకు సమ్మె కొనసాగిస్తాం.

– సిర్ర దేవేందర్, తెలంగాణ కాంట్రాక్ట్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి

చర్యలు తీసుకుంటున్నాం

రోగులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. కొంత మంది కార్మికులు సమ్మెకు దిగారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్, ఆదిలాబాద్

ప్రశాంతంగా సైనిక్ స్కూల్ ప్రవేశపరీక్ష

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైనిక్ స్కూల్‌లో ఆరో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన పరీక్ష ఆదిలాబాద రీజియన్‌లో ప్రశాంతంగా జరిగింది. 843 మంది దరఖాస్తు చేసుకోగా 781 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 62 మంది గైర్హాజరయ్యారు. 92.65 శాతం నమోదైనట్లు ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదిలాబాద్ రీజియన్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి ప్రకటించారు. ఆదిలాబాద్ రీజియన్ వ్యాప్తంగా మూడుచోట్ల పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్‌లో సీవోఈ బాలికల కళాశాల, ఆసిఫాబాద్‌లో బాలుర గురుకుల కళాశాల, బెల్లంపల్లిలో బాలుర గురుకుల సీవోఈ కళాశాలలో కేంద్రాలు ఏర్పాటు చేశారు.

విద్యార్థుల హాజరు వివరాలు

ఆదిలాబాద్‌లో ఆరోతరగతిలో 116 మందికి గానూ 108 మంది హాజరుకాగా ఎనిమిదిమంది గైర్హాజరయ్యారు. ఇంటర్‌లో 114 మందికి గానూ 110 మంది హాజరుకాగా నలుగురు గైర్హాజరయ్యారు. ఆసిఫాబాద్‌లో ఆరో తరగతిలో 95 మందికిగానూ 84 మంది హాజరుకాగా 11 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్లో 60 మందికి గానూ 48 మంది హాజరుకాగా 12 మంది గైర్హాజరయ్యారు. బెల్లంపల్లిలో ఆరోతరగతిలో 227 మందికిగానూ 215 మంది హాజరు కాగా 12 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్‌లో 231 మందికి గానూ 216 మంది హాజరుకాగా 15 మంది గైర్హాజరయ్యారు.


బెల్లంపల్లిలో పరిశీలిస్తున్న ఆర్సీవో స్వరూపారాణి

సావిత్రీబాయి పూలే సేవలు చిరస్మరణీయం

- మాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న శేండే

ఆదిలాబాద్‌రూరల్: దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే సేవలు చిరస్మరణీయమని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న శేండే అన్నారు. జిల్లాకేంద్రంలోని సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయ ఆవరణలో ఆమె 128వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిబాపూలే దంపతుల విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ విద్య, మహిళా సాధికారిత కోసం సావిత్రీబాయి పూలే భర్త జ్యోతిబాపూలే సహకారంతో 1848లో మహారాష్ట్రలోని పుణెలో తొలి మహిళా పాఠశాలను ప్రారంభించారని గుర్తుచేశారు. ఆమె గొప్ప సామాజికవేత్త అని పేర్కొన్నారు. రాష్ట్ర కోశాధికారి సతీశ్ గురుఖులే, జిల్లా కార్యవర్గ సభ్యులు విజయ్ వాడగురే, మాందాడే రామ్ కిషన్, మాందడే జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న మాలీ సంఘం నేతలు

ఆత్మీయ సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

తలమడుగు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1987–88 బ్యాచ్ పదోతరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 36 ఏళ్ల తర్వాత వీరి ఆత్మీయ సమ్మేళనానికి పాఠశాల వేదికై ంది. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనాటి తీపిగుర్తులను నెమరువేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు లింగారెడ్డి, లచ్చారెడ్డి, శ్రీనివాస్, సంపత్‌ను సన్మానించారు. మాజీ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, పూర్వవిద్యార్థులు రమేశ్, రాములు, సత్యానారాయణ, ప్రహ్లాద్, అశోక్, ప్రమోద్‌రెడ్డి, ప్రమోద్ పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుడి రిమాండ్

భైంసాటౌన్: పట్టణంలోని సాయికాటన్ వద్ద శనివారం సాయంత్రం జరిగిన సయ్యద్ సోహెల్ హత్యకేసులో నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ తెలిపారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ఓవైసీనగర్‌కు చెందిన సయ్యద్ సోహెల్, నయాబాదికి చెందిన అబ్దుల్ జుబేర్ ఇద్దరు స్నేహితులు. కొన్నిరోజులుగా నగదు విషయమై వీరి మధ్య తగాదా తలెత్తింది. ఈనెల 8న ఈ విషయమై మళ్లీ గొడవ జరుగగా, ఇరు కుటుంబీకుల సమక్షంలో రాజీ కుదిర్చారు. దీంతో మళ్లీ ఇద్దరు స్నేహితులుగా మారిన క్రమంలో శనివారం సాయంత్రం అబ్దుల్ జుబేర్ సోహెల్ కోసం అతని ఇంటికెళ్లగా లేకపోవడంతో బస్టాండ్ వద్ద ఉన్నాడని తెలుసుకుని బైక్‌పై వెళ్లాడు. తిరిగి అతనితో కలిసి బైక్‌పై సాయికాటన్ వైపు వస్తుండగా, మరోసారి గొడవ తలెత్తింది. జుబేర్ తన వద్ద ఉన్న టెస్టర్ (స్క్రూడ్రైవర్)తో సోహెల్‌పై దాడికి దిగాడు. తీవ్ర గాయాలపాలైన అతన్ని స్థానికులు ఏరియాస్పత్రికి తరలించారు. నిజామాబాద్‌కు తరలిస్తుండగా మృతిచెందిన విషయం తెలిసిందే. ఈమేరకు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపగా, సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. హత్యకు ఉపయోగించిన టెస్టర్‌తోపాటు సెల్‌ఫోన్, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ వెల్లడించారు. సమావేశంలో పట్టణ సీఐ డి.రాజారెడ్డి, ఎస్సైలు ఎండీ షరీఫ్, గౌసుద్దీన్ పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్

ట్రాక్టర్ బోల్తా.. పలువురికి తీవ్రగాయాలు


క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న స్థానికులు

ఇంద్రవెల్లి: మండలంలోని పాటగూడ(కే) సమీపంలో ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. శివరాత్రి పూజల్లో భాగంగా ఆదిలాబాద్ రూరల్ మండలం ఖండాల గ్రామానికి చెందిన ఆదివాసీలు మహాభారత నాటక ప్రదర్శన కోసం శనివారం రాత్రి సిరికొండ మండలం సుంకిడికి వెళ్లారు. ప్రదర్శన అనంతరం వారు ఆదివారం ఖండాల గ్రామానికి ట్రాక్టర్‌లో వస్తుండగా ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కృష్ణ, కుమ్ర గుణ్వంత్‌రావ్, పెందోర్ కార్తీక్, పెందోర్ శంక్రులకు తీవ్ర గాయాలు, మిగతా 9 మందికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను రెండు అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. కృష్ణ పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం వైద్యులు హైదరాబాద్‌కు రెఫర్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నిర్మల్‌రూరల్: మండలంలోని చిట్యాల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. రూరల్ పోలీసులు, స్థానికుల తెలిపిన వివరాలు.. దిలావర్‌పూర్ మండలం మాయాపూర్ గ్రామానికి చెందిన యువకుడు నరేశ్‌గౌడ్ (35) వ్యక్తిగత పనిపై ఆదివారం సాయంత్రం బైక్‌పై జిల్లాకేంద్రానికి వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి రాత్రి వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి వేగంగా ఢీకొట్టడంతో నరేశ్‌గౌడ్ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

టిప్పర్‌ను ఢీకొన్న బైక్

ఆదిలాబాద్‌రూరల్: మావల మండల కేంద్రంలో శనివారం టిప్పర్‌ను బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రంగా, మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. మావల ఎస్సై విష్ణువర్ధన్ కథనం ప్రకారం..గుడిహత్నూర్ మండలం మల్కాపూర్‌కు చెందిన భరత్, శీను, కైలాస్‌లు సీతగొంది నుంచి ఆదిలాబాద్ వైపు శనివారం బైక్‌పై వస్తున్నారు. ఈక్రమంలో మావల మండల కేంద్రంలో ప్రైవేట్ స్కూల్‌కు వెళ్లే మార్గంలో టిప్పర్ డ్రైవర్ ఆకస్మాత్తుగా యూటర్న్ తీసుకున్నాడు. ఆ సమయంలో వెనుక నుంచి బైక్ టిప్పర్‌ను ఢీకొనడంతో భరత్‌కు తీవ్రంగా, శీనుకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను రిమ్స్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం భరత్‌ను హైదరాబాద్‌కు తరలించారు. భరత్ తండ్రి నాగోరావ్ ఫిర్యాదుతో టిప్పర్ డ్రైవర్‌పై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

బోథ్: మండలంలోని సొనాల గ్రామశివారులో పేకాట ఆడుతున్న నలుగురిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్సై రాము తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.6,950 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పేకాట ఆడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకోలి గ్రామానికి చెందిన రైతు భీమణవేణి మల్లన్న (54) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ముజాహిద్ కథనం ప్రకారం.. గ్రామంలో మల్లన్నకు 1.20 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. గతకొన్ని రోజులుగా ఎలాంటి పని చేయకుండా మద్యానికి బానిసయ్యాడు. ఇదేక్రమంలో కొంత మేర ప్రైవేట్ అప్పులు చేశారు. వాటిని ఎలా తీర్చాలో మనస్తాపంతో ఉన్న ఆయన శనివారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివా రం మృతిచెందాడు. భార్య వెంకటమ్మ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముత్తన్నకు అవార్డు

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామానికి చెందిన డా.బిట్లింగ్ ముత్తన్న 'జ్యోతిష్య బ్రహ్మ'అవార్డు పొందారు. ఆస్ట్రాలజీ విభాగంలో పీహెచ్‌డీ చేసిన ఆయనకు ఆదివారం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో ఎన్ఎస్ ఆస్ట్రాలజీ ఫౌండర్ నర్సింహస్వామి అవార్డు అందించారు.


అవార్డు అందుకుంటున్న ముత్తన్న

ప్రమాదకరంగా డివైడర్లు

నిర్మల్ పట్టణ సుందరీకరణలో భాగంగా ప్రధాన కూడళ్ల వద్ద చేపట్టిన డివైడర్లు పగలిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. కొన్నిచోట్ల బండరాళ్లు కిందపడి దర్శనమిస్తోంది. కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేపట్టడంతో ఈ పరిస్థితి నెలకొందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ డివైడర్లను పరిశీలించి దీటిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా డివైడర్లకు మరమ్మతు చేపడుతారో లేదో చూడాలి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్


శివాజీచౌక్ నుంచి బస్‌డిపో బోయవాడ వద్ద..


ఎన్టీఆర్ మినీ స్టేడియం ముందు ప్రధాన కూడలి వద్ద..


వివేకానంద చౌక్ లో బీటలువారి పగిలి..


డాక్టర్స్ లైన్లో..


బయల్ బజార్ వద్ద కూడలిలో..